## ఆరవ ప్రకరణం

# సిసలయిన ఆరాధనకు మూలసూత్రాలు

'ఆరాధన' అనేది మూడు మూలస్తంభాలపై నిలబడి ఉంది : (1) ప్రేమ (భక్తి), (2) భయము (3) ఆశ.

కనుక ఆరాధన (ఇబాదత్)లో అశక్తత, అణకువలతో పాటు ప్రేమ పరవశించాలి. భీతితో పాటు ఆశాభావం కూడా ఉట్టిపడాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿فَسَوْفَ يَأْتِي اللَّهُ بِقَوْمٍ يُحِبُّهُمْ وَيُحِبُّونَهُ﴾ (المائدة:٥٤)

**"అలాగైతే అల్లాహ్ త్వరలోనే మరో జాతి వారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు. వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు." (అల్ మాయిద : 54)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِّلَّهِ﴾ (البقرة:١٦٥)

**"విశ్వసించినవారు అల్లాహ్‌ను అంతకంటే ప్రగాఢంగా (అధికంగా) ప్రేమిస్తారు." (అల్ బఖర : 165)**

దేవుడు తన ప్రవక్తల సుగుణాలను వివరిస్తూ ఇలా సెలవిచ్చాడు :

﴿إِنَّهُمْ كَانُوا يُسَارِعُونَ فِي الْخَيْرَاتِ وَيَدْعُونَنَا رَغَبًا وَرَهَبًا وَكَانُوا لَنَا خَاشِعِينَ﴾ (الأنبياء:٩٠)

**"ఈ సజ్జనులు సత్కార్యాల కోసం త్వరపడేవారు. ఆశతోనూ, భయం తోనూ మమ్మల్ని వేడుకునేవారు." (అల్ అంబియా : 90)**

కొందరు సలఫ్‌లు ఇలా అభిప్రాయపడ్డారు : కేవలం ప్రేమాతిశయంతో దైవారాధన చేసినవాడు పాషండుడు, పారసీక మతస్థుడు (జిన్ దీఖ్). కేవలం ఆశతో దైవారాధన చేసేవాడు మర్జీ వర్గీయుడు. కేవలం భయం కొద్దీ దైవారాధన చేసేవాడు ఖవారిజ్ వర్గానికి చెందినవాడు. ప్రేమ, భయం, ఆశ – ఈ మూడు భావాలను రంగరించి దైవారాధన చేసేవాడు విశ్వాసి, ఏక దైవారాధకుడు. షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ రిసాల (అల్ అబూదియహ్)లో ఈ విషయం ప్రస్తావించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు : దైవధర్మం అంటే ఏమిటి? దైవాన్ని ఆరాధించటం. ఆయనకు విధేయులై ఉండటం. ఆయన ముందు అశక్తతను, అణకువను వ్యక్తపరచటం. అశక్తత, అణకువలకు నామాంతరమే ఆరాధన. ఏదైనా దారి పదే పదే నడవటం వల్ల సుగమం అవుతే దానిని అరబీలో طريق متعبد **'తరీఖ్ ముతఅబ్బద్'** (దాసోహమన్న దారి) అంటారు. అయితే మనిషికి ఆజ్ఞాపించబడిన దాస్యం (ఆరాధన)లో దీనావస్థతో పాటు, ప్రేమ కూడా కలగలసి ఉంది. అంటే ఆరాధనకు పూనుకున్నప్పుడు అతనిలో అల్లాహ్ పట్ల అమితమైన ప్రేమ పొంగి

https://teluguislam.net

పొరలడంతో పాటు, అతనిలో వినయ వినమ్రతలు కూడా ఉట్టిపడాలి. ఎవరయినా వేరొకరి యెడల ద్వేషాన్ని అణచిపెట్టుకుని అతనికి లోబడి వ్యవహరిస్తే, అతన్ని ఆరాధించేవాడని అనరు. అలాగే అతను ఏదైనా వస్తువును అమితంగా ఇష్టపడుతూ కూడా దానికి లోబడకపోతే దానిపట్ల అతనికి గల ఆరాధనా భావం స్వీకారయోగ్య మవదు. ఉదాహరణకు: మనిషి తన ఆలుబిడ్డలను ప్రేమిస్తాడు. చెప్పవచ్చిందేమిటంటే; రెండింటిలో ఏదో ఒక్క వస్తువు ఉన్నంత మాత్రాన అది అల్లాహ్ ఆరాధనకు సరిపోదు. పైగా దాసుని దృష్టిలో అల్లాహ్ అన్ని వస్తువులకన్నా ఎక్కువ ప్రియతముడై ఉండాలి. అన్ని వస్తువులకన్నా గొప్పవాడై ఉండాలి. ఇంకా చెప్పాలంటే ప్రేమకు, సంపూర్ణ విధేయతకు హక్కుదారుడు కేవలం అల్లాహ్ మాత్రమే అయి ఉండాలి. (మజ్మూఅతు త్తౌహీద్ అన్ నజ్దియ : పేజీ – 549)

ఇవీ ఆరాధన యొక్క ప్రాథమిక సూత్రాలు. వీటిపైనే అది ఆధారభూతమై ఉంది. అల్లామా ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) **'ఖసీదహ్ నూనీయ'**లో ఇలా అంటున్నారు –

"కరుణామయుని దాస్యం (ఆరాధన) ఎలా ఉండాలంటే ఆరాధకుడు అత్యంత వినయ వినమ్రతతో పాటు అల్లాహ్ యెడల అంతులేని ప్రేమ కలిగి ఉండాలి. ఆరాధనకు ఇవి రెండూ (వినమ్రత, ప్రేమ) మూలాంశాలు (ధ్రువ నక్షత్రాలు). ఈ రెండింటిపైనే ఆరాధన అనే అంతరిక్ష గ్రహం పరిభ్రమిస్తూ ఉంది. ఈ రెండు ధ్రువ నక్షత్రాలు నెలకొననంత వరకూ గ్రహం తిరుగాడదు. ఈ పరిభ్రమణం కూడా దైవప్రవక్త (صلى الله عليه وسلم) ఆదేశానుసారం జరుగుతోంది. మనో వాంఛలకు, పైశాచిక ప్రేరణలకు లోబడి ఎంత మాత్రం కాదు."

ఇబ్నుల్ ఖయ్యిమ్ (رحمه الله) ప్రియతముడు అయిన అల్లాహ్ కోసం అశక్తత, అణకువ, ప్రేమలతో కూడుకున్న ఆరాధనా పరిభ్రమణమును రెండు ధ్రువ నక్షత్రాలపై పరిభ్రమించే అంతరిక్ష గ్రహంతో పోల్చారు. ఈ ఆరాధన కూడా మహాప్రవక్త ముహమ్మద్ (صلى الله عليه وسلم) ఆదేశానికి, ఆయన గారి షరీయత్‌కి అనుగుణంగా ఉంటుందని ప్రస్తావించారు. అంతేగాని మనోవాంఛలకు, పైశాచిక ప్రేరణలకు లోబడి కాదు. ఎందుకంటే ఇవి ఆరాధన (ఇబాదత్) కావు గనక. కాబట్టి దైవప్రవక్త ముహమ్మద్ (صلى الله عليه وسلم) నిర్దేశించినది మాత్రమే ఆరాధన అనే అంతరిక్ష గ్రహాన్ని నడిపిస్తుంది. దురాచారాలు, కల్పిత విషయాలు, మనోవాంఛలు, తాతల తండ్రుల అనుసరణా పంథా దానిని నడిపించలేవు.